సాక్షి హనుమకొండ

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023

విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్న కరుణాపురం చర్చి (ఇన్‌సెట్‌లో), భారీ క్రిస్మస్ ట్రీ





చర్చిల ముస్తాబు

నగరానికి క్రిస్మస్ కళ వచ్చేసింది. ఇప్పటికే క్రైస్తవులు ఇళ్ల ఎదుట స్టార్లు ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం జరగనున్న క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ధర్మసాగర్ మండలం కరుణాపురం చర్చిని అందంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. చర్చి లోపల, ఆవరణలో క్రీస్తు జననం, విశిష్టతను తెలిపేలా పాక, ఇతర ఏర్పాట్లు చేశారు. – కాజీపేట రూరల్/ధర్మసాగర్

న్యూస్‌రీల్

వినియోగదారుల చట్టంపై అవగాహన ఉండాలి



కాజీపేట: దేశంలోని ప్రతీ వ్యక్తి వినియోగదారుల చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జీ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన జాతీయ వినియోగదారుల దినోత్సవ అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వినియోగదారుల రక్షణకు 1986 ప్రకారం ప్రత్యేక చట్టం ఉందన్నారు. డిజిటల్ చెల్లింపుల సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి.వసంతలక్ష్మి, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ మహేందర్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీఐ వేణు, రతన్‌సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

హన్మకొండ: వరంగల్ అర్బన్ జెడ్పీ సర్వసభ్య సమావేశం ఈనెల 30న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జిల్లా జెడ్పీ కార్యాలయంలో 30న ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అర్హులందరికీ పథకాలు



నయింనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని 53వ డివిజన్ లష్కర్ సింగారం బెతెల్ బాప్టిస్ట్ చర్చిలో శనివారం క్రిస్టియన్లకు క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్లను రాజేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబా భాయి, ఎర్ర కావ్య, ఎర్ర మహేందర్, కూర సురేందర్, వై.అబ్రహం, శ్యాం, చందు, రాజేశ్, శంకర్, మైనార్టీ డిపార్ట్‌మెంట్ ఈడీ శ్రీనివాస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సీపీ



వరంగల్ క్రైం: రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం కలిశారు. హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జాతరను విజయవంతం చేయండి

సమీక్షలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు: భక్తులకు ఇబ్బంది కలిగితే సహించేది లేదని, అధికారులు సమన్వయంతో పని చేసి అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతరను విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్‌లోని సమ్మక్క–సారలమ్మను ఎమ్మెల్యే శనివారం దర్శించుకున్నారు. అనంతరం సమ్మక్క గద్దెల ప్రాంగణంలోనే జాతర సన్నద్ధతపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరలో నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దని అధికారులకు సూచించారు. కేటాయించాలని ఈఓ శేషగిరికి సూచించారు. కాగా.. గత జాతరకు వేసిన రోడ్డుతో తాము భూమి కోల్పోయామని అగ్రంపహాడ్‌కు చెందిన బోరిగం మనోజ్ ఎమ్మెల్యేకు విన్నవించగా.. పరిశీలిస్తానని రేవూరి అన్నారు. తక్కళ్లపాడ్–అగ్రంపహాడ్ బీటీ రోడ్డును నెలరోజుల్లో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఎంపీపీ మార్క సుమలత రజినీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రవిరాజు, ఎంపీఓ చేతన్‌రెడ్డి పాల్గొన్నారు.

కోవిడ్‌పై జాగ్రత్తలు తప్పనిసరి

- డీఎంహెచ్‌ఓ సాంబశివరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

ఎంజీఎం: కోవిడ్ కేసులు వివిధ ప్రాంతాల్లో నమోదవుతున్న క్రమంలో ప్రజలు ఆందోళన చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు సూచించారు. శనివారం వరకు జిల్లాలో ఎలాంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదని ఆయన తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కోవిడ్‌పై వైద్యాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా కోవిడ్ కేసులు ఎక్కువగా నమోదైతే తట్టుకునేలా మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. జలుబు, జ్వరం, దగ్గు, ఆయాసం ఉన్న అనుమానితులను దగ్గరలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్ష చేయించాలన్నారు. ఆర్టీపీసీఆర్ పరీక్షలను హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న మున్సిపల్ గెస్ట్ హౌజ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'పార్లమెంట్'లో నెగ్గాల్సిందే..!

వరంగల్, మహబూబాబాద్ స్థానాలపై అన్ని పార్టీల గురి

- ప్రధాన పార్టీల్లో మొదలైన కసరత్తు..
- అసెంబ్లీ ఫలితాలపైనా లోతైన విశ్లేషణ..2018, 2023 ఫలితాలపై అంతర్మథనం
- అభ్యర్థుల ఎంపికపైనా సాగుతున్న కసరత్తు
- వ్యూహాలకు పదును పెడుతున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు



సాక్షిప్రతినిధి, వరంగల్: పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన, ఓడిన పార్టీలు ఎలాగైనా పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలన్న పట్టుదలతో ఉన్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఎంపీ ఎన్నికల్లోనూ పై చేయి సాధించేందుకు ఇటీవల ఇన్‌చార్జ్‌లను నియమించింది. అధికారం కోల్పోయి అసెంబ్లీ ఫలితాలను విశ్లేషించిన బీఆర్‌ఎస్ వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఓటుశాతం పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. మరోవైపు బీజేపీ పదాధికారుల భేటీలు నిర్వహిస్తోంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే బలం పెంచుకునే ప్రయత్నంలో ఉంది.

ఎవరి ధీమా వారిదే..

అభ్యర్థుల ఖరారుపై కసరత్తు...

ఉమ్మడి వరంగల్‌లోని రెండు పార్లమెంట్ స్థానాల్లో ఒకటి ఎస్సీ, మరోటి ఎస్టీలకు రిజర్వు చేసిన విషయం తెలిసిందే. వరంగల్ (ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ) స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ నేతలు పసునూరి దయాకర్, మాలోతు కవిత పార్లమెంట్ సభ్యులుగా ఉన్నారు. ఈసారి ఈ రెండు స్థానాలపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ఎవరికి వారు గెలుపు ధీమాను వ్యక్తం చేస్తూ అభ్యర్థులను బరిలో దింపే యోచనలో ఉన్నారు. విజయోత్సాహంలో ఉన్న కాంగ్రెస్ మరింత దూకుడు పెంచి అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి సీఎం అయిన రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికలు కూడా ఆయన సారథ్యంలోనే నిర్వహించేందుకు అధిష్టానం నిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా, ఈసారి స్టేషన్‌ఘన్‌పూర్ మినహా ఆరు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో భద్రాచలం తప్ప అన్నీ కాంగ్రెస్ వశమయ్యాయి. 2019 ఎన్నికల్లో రెండు చోట్ల కాంగ్రెస్ ఓడిపోయింది. వరంగల్‌లో మొత్తం 10.61 లక్షల ఓట్లు పోలవ్వగా బీఆర్‌ఎస్ 6.12 లక్షల ఓట్లను పొంది విజయం సాధించింది. మహబూబాబాద్‌లో మొత్తం 9,83,707 ఓట్లు కాగా అందులో బీఆర్‌ఎస్ 4.61 లక్షలతో 46.98 శాతం ఓట్లను సాధించింది. ఈసారి ఈ రెండు పార్లమెంటు స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్కో అసెంబ్లీ స్థానం మాత్రమే దక్కాయి. దీంతో ఈసారి గట్టిగానే కృషి చేయాలనే పట్టుదలతో పార్టీవర్గాలు ఉన్నాయి. అదేవిధంగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వరంగల్, మహబూబాబాద్‌లో కనీస పోటీ ఇవ్వలేకపోయింది. మహబూబాబాద్‌కు అసెంబ్లీ ఎన్నికల ముందు మోదీ వచ్చి ప్రచారం చేసినా ఆశించిన మేర ఓట్ల శాతం పెరగలేదు. ఈనేపథ్యంలో ఆ పార్టీ నాయకత్వం సైతం సీరియస్‌గానే ఆలోచిస్తోంది.

అసెంబ్లీ ఫలితాలు బేరీజు..

అన్ని పార్టీల టార్గెట్ 'లోక్‌సభ'

రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. జనగామ అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరి పార్లమెంట్ కిందికి వస్తుంది. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి 14 సెగ్మెంట్లలో 12 చోట్ల కాంగ్రెస్, రెండు చోట్ల బీఆర్‌ఎస్ గెలిచింది. 14 నియోజకవర్గాల పరిధిలో పొందిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటే కాంగ్రెస్ 12,46,282 ఓట్లతో మొదటి స్థానంలో, 9,47,208 ఓట్లతో బీఆర్‌ఎస్ రెండోస్థానంలో నిలిచింది. 1,91,114 ఓట్లు బీజేపీ అభ్యర్థులు సాధించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం మినహా బీజేపీ అన్ని సెగ్మెంట్లలో మూడో స్థానంలోనే ఉంది. మరికొద్ది రోజుల్లోనే పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు దూకుడు పెంచాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనుకూలంగా రావడంతో ఊపులో ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లను ఇటీవల నియమించింది. వరంగల్, మహబూబాబాద్‌లకు మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అధిష్టానం అభ్యర్థుల గెలుపు బాధ్యతలు అప్పగించింది. మరోవైపు బీఆర్‌ఎస్ అధిష్టానం సైతం మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లకు ఇటీవలే దిశానిర్దేశం చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారులో ఆలస్యం జరగడం వల్లే ఆశించిన ఫలితాలు రాలేదని విశ్లేషిస్తున్న బీజేపీ.. ఈసారి ముందుగానే ప్రకటించేందుకు సమావేశాలు నిర్వహిస్తోంది.

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకు వచ్చిన ఓట్లు...

వరంగల్ పార్లమెంట్..

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
స్టేషన్‌ఘన్‌పూర్(ఎస్సీ)	93,917	1,01,696	4,984
పాలకుర్తి	1,26,848	79,214	2,982
పరకాల	72,573	64,632	38,735
వరంగల్ పశ్చిమ	72,649	57,318	30,826
వరంగల్ తూర్పు	67,757	42,783	52,105
వర్ధన్నపేట(ఎస్సీ)	1,06,696	87,238	12,275
భూపాలపల్లి	1,23,116	70,417	14,731
మొత్తం	6,63,556	5,03,298	1,56,638

మహబూబాబాద్ పార్లమెంట్..

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
డోర్నకల్(ఎస్టీ)	1,15,587	63,456	1,817
మహబూబాబాద్(ఎస్టీ)	1,16,644	66,473	17,083
నర్సంపేట	1,04,185	85,296	3,062
ములుగు	1,02,267	68,567	5,388
పినపాక	90,510	56,004	2,627
ఇల్లందు	1,09,171	51,862	2,568
భద్రాచలం	47,533	53,252	1,931
మొత్తం	5,76,726	4,43,910	34,476

వరంగల్ అభివృద్ధే లక్ష్యం



పేద క్రిస్టియన్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

- మంత్రి కొండా సురేఖ
- క్రిస్టియన్లకు బహుమతుల పంపిణీ

వరంగల్: వరంగల్ నగర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఎల్‌బీనగర్ అబ్బూస్ ఫంక్షన్‌హాల్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ కేక్ కట్ చేసి, పేద క్రిస్టియన్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతోనే తాను మంత్రినయ్యానన్నారు. ఆలయాలు, మసీదులు, శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లకు సుమారు రూ.400 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సహకారంతో తూర్పు నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తానన్నారు. ఫాదర్‌లు, అర్చకులు, ఇమామ్‌లకు గౌరవ వేతనాలు పెంచాలనే అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చామని, అందుకు అనుగుణంగా రూ.12 వేలు అందించేలా త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రితో పాటు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రజలకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, పోశాల పద్మ, పల్లం పద్మ, మరుపల్ల రవి, గుండు చందన, అయూబ్‌ఖాన్, వేడుకల నోడల్ అధికారి కృష్ణారెడ్డి, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, వివిధ చర్చిల ఫాదర్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న మంత్రి కొండా సురేఖ

ఉత్తర ద్వార దర్శనం..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా వరంగల్ నగరంలోని బట్టల బజార్ బాల నగర వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం మంత్రి కొండా సురేఖ సందర్శించారు. ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు.

పిలిచినా మేయర్ రాలేదా?

ప్రభుత్వ అధికార కార్యక్రమంగా శనివారం ఎల్‌బీనగర్ అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ సంబరాలకు మేయర్ గుండు సుధారాణి హాజరవలేదు. కాగా.. మేయర్‌ను ఆహ్వానం అందిందా? అయినా రాలేదా? అనే చర్చ సాగింది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు మరుపల్ల రవి, పోశాల పద్మ, పల్లం పద్మ, గుండు చందన పాల్గొన్నప్పటికీ స్థానిక కార్పొరేటర్‌తో పాటు తూర్పు నియోజకవర్గ పరిధి మిగిలిన కార్పొరేటర్లు కనిపించలేదు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తి

వరంగల్ లీగల్: హనుమకొండ, వరంగల్, నర్సంపేట, పరకాల కోర్టుల్లో ఈనెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. హనుమకొండ, వరంగల్ కోర్టులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 30లోపు రాజీ కుదుర్చుకునేలా ప్రీ లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లోక్ అదాలత్‌కు న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, పోలీసులు సహకరించాలని సూచించారు. కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలోని 852 పెండింగ్ కేసులకు కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. వరంగల్ జిల్లాలో ప్రీ లిటిగేషన్ ఎలక్ట్రిసిటీ కేసులు 3వేలు, బ్యాంకు కేసులు 900, బీఎస్‌ఎన్‌ఎల్ కేసులు 200, హనుమకొండలో 265 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు హనుమకొండ జిల్లాలో 7 బెంచ్‌లు, వరంగల్ జిల్లాలో 6 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏమైనా సందేహాలు, సలహాలు, న్యాయ సాయం కోసం న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించాలని సూచించారు. సమావేశంలో జిల్లా న్యాయమూర్తి వై.సత్యేంద్ర, సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్‌మోహన్, ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

ఇచ్చిన అప్పు చెల్లించడం లేదని మహిళ బలవన్మరణం

- న్యాయం చేయాలని మృతదేహంతో బంధువుల ఆందోళన
- సర్పంచ్, సొంత మరిది కారణమని ఆరోపణ

కమలాపూర్: ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించడం లేదని మనస్తాపానికి గురైన గుర్రం సరళ (53) పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అంబాలలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాలకు చెందిన గుర్రం సాంబయ్య–సరళ దంపతులు సుమారు ఆరేళ్ల క్రితం ఎకరం భూమిని ప్రస్తుత సర్పంచ్ లింగమూర్తికి విక్రయించారు. ఆ తర్వాత వారి వద్ద నుంచి సర్పంచ్ రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అదేవిధంగా సాంబయ్య తమ్ముడు అశోక్ సైతం ఆరేళ్ల క్రితం వీరి నుంచి రూ.8 లక్షలు అప్పుగా తీసుకుని ఇప్పటి వరకు తిరిగి ఇవ్వడం లేదు. ఇద్దరు కూడా ఆ డబ్బులు ఇప్పటి వరకు తిరిగి ఇవ్వకపోగా మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మూడు రోజుల క్రితం సర్పంచ్ ఇంటికెళ్లి డబ్బులివ్వాలని అడిగితే ఇవ్వకపోగా 'డబ్బులు లేవు, ఏం లేవు, ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి' అని దబాయించాడని, డబ్బులివ్వకపోతే సరళ చస్తాననగానే 'చస్తే చావుపో' అని నానా దుర్భాషలాడాడని ఆరోపించారు. ఇచ్చిన అప్పు చెల్లించకపోగా తమనే నానా దుర్భాషలాడుతున్నారని తీవ్ర మనస్తాపానికి గురైన సరళ శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం సరళ మృతదేహాన్ని అంబాలకు తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు తమకు న్యాయం చేయాలని, తమ వద్ద తీసుకున్న అప్పు చెల్లించాలని, లేదంటే తమ భూమి తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న హసన్‌పర్తి సీఐ గోపీ, కమలాపూర్ ఎస్సై కరుణాకర్ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని బాధిత కుటుంబీకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. మధ్యాహ్నం నుంచి ఆందోళన చేస్తున్నా సర్పంచ్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మృతదేహాన్ని సర్పంచ్ ఇంటివద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగింది. మృతురాలి కుమారుడు కిషోర్ ఫిర్యాదు మేరకు సర్పంచ్ లింగమూర్తి, గుర్రం అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.





మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, (ఇన్‌సెట్‌లో) గుర్రం సరళ (ఫైల్)

నేషనల్ హైవేకు పీవీ పేరు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- వంగరలో విగ్రహానికి నివాళి



వంగరలో పీవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి: హనుమకొండ–సిద్దిపేట నేషనల్ హైవేకు పీవీ పేరు పెడతామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం వంగరలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 19వ వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పటిష్టం చేశారని గుర్తు చేశారు. నిధుల కొరత ఉన్నప్పటికీ వంగరలో జరుగుతున్న గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం పీవీ మ్యూజియంగా మార్చిన ఆయన ఇంటిని పొన్నం సందర్శించి ఫొటో, చిత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, జేసీ మహేందర్‌జీ, ఆర్డీఓ రమేశ్, సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ఎంపీపీ జక్కుల అనితరమేశ్, సర్పంచ్ ఆలూరి రజిత, ఎంపీఓ నాగరాజ్, ఏసీపీ డేవిడ్‌రాజ్, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఇంద్రసేనారెడ్డి, బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, శ్రీకాంత్, మండ సుమన్‌గౌడ్, రమేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ అమానుషం : వీసీ

కేయూ క్యాంపస్: 'ర్యాగింగ్ అనేది అమానుషం. ర్యాగింగ్‌కు పాల్పడేవారిపై చర్యలు తప్పవు' అని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. కేయూలో ర్యాగింగ్ ఆరోపణల నేపథ్యంలో.. మొత్తం 83 మంది సీనియర్లను సంబంధిత అధికారులు హాస్టళ్ల నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. శనివారం మీడియా ప్రతినిధులు వీసీ తాటికొండ రమేశ్‌ను కలిసి ర్యాగింగ్, విద్యార్థుల సస్పెన్షన్‌పై ప్రశ్నించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో కొంత భయం ఉండాలనే వారిని హాస్టల్ నుంచి వారం రోజులు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. మళ్లీ యథావిధిగా ఆసస్పెండ్ తొలగించి హాస్టల్ వసతి కొనసాగిస్తామన్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలు కూడా ఏర్పాటయ్యాయన్నారు. ఆయన వెంట కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వెంకయ్య, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుచరితపాల్ తదితరులు ఉన్నారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్‌లో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని రిజిస్ట్రార్ హెచ్చరించారు.

క్లుప్తంగా

శ్రీమద్భగవద్గీత శ్లోక పఠన పోటీలు



హన్మకొండ కల్చరల్: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ వరంగల్ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో భగవద్గీత శ్లోక పఠన పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో భాగంగా భగవద్గీత మూడవ అధ్యాయం కర్మ సన్యాస యోగంలోని ఒకటి నుంచి 30 శ్లోకాలు, సంపూర్ణ భగవద్గీతపై పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. టీటీడీ డీపీపీ ప్రోగ్రాం ఆఫీసర్ రామిరెడ్డి కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

బీజేపీ అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకించండి

న్యూశాయంపేట: దేశ చరిత్రలో కనీవిని ఎరగని విధంగా లోక్‌సభ నుంచి 146మంది సభ్యులను సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్య అని, బీజేపీ అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. హనుమకొండ రాంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.చుక్కయ్య అధ్యక్షతన జిల్లా విస్తృతస్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్‌రావు మాట్లాడుతూ పార్లమెంటులో ఆగంతకులు దాడి చేసిన అంశాన్ని సభలో చర్చించాలని ప్రశ్నించిన ప్రతిపక్షాల ఎంపీలను బీజేపీ సర్కారు సస్పెండ్ చేయడం శోచనీయమని అన్నారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించారు. సమావేశంలో నాయకులు చక్రపాణి, వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలయ్య, వీరన్న, వెంకట్ రాములు, లింగయ్య, తిరుపతి పాల్గొన్నారు.

11మంది మాల్‌ప్రాక్టీస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శనివారం నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో వివిధ పరీక్షల కేంద్రాల్లో కాపీయింగ్‌కు పాల్పడిన 11మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ బుక్ అయ్యారు. ఈమేరకు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమల దేవి తెలిపారు.



పాకాల సోయగం..



వరంగల్ జిల్లా నర్సంపేట సమీపంలోని కొత్తగుడెం రహదారిలో రమణీయ నీటి సరస్సు పాకాల. ఇక్కడ పచ్చని చెట్లు, పూల మొక్కలు, చల్లటి నీడలో పర్యాటకులు సేదదీరుతుంటారు.అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చిల్డ్రన్స్ పార్క్ మరింత ఆహ్లాదంగా కనిపిస్తుంది. సువిశాల సరస్సులో బోటు షికారు చేస్తూ ప్రకృతిని ఆస్వాదించొచ్చు. మరికొంత మంది తూము వద్ద స్నానాలు చేస్తూ సందడి చేస్తుంటారు.

లక్నవరం అందాలు..



ములుగు జిల్లా చల్వాయిలోని గుట్టల మధ్య సువిశాల లక్నవరం నీటి సరస్సు ఉంటుంది. ఇక్కడ అలలు సముద్రాన్ని తలపించేలా ఎగిసిపడుతుంటాయి. సరస్సు మధ్య దీవులు ఉన్నాయి. ఈ దీవులకు వెళ్లేందుకు పర్యాటక శాఖ తీగల వంతెన ఏర్పాటు చేసింది. దీంతో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో చేరుకుని రోజంత వీక్షించి ఆహ్లాదంగా గడిపి వెనుదిరుగుతుంటారు.

వరుస సెలవులు.. చూసొద్దాం రండి..

ఆధ్యాత్మిక, ఆహ్లాదకరంగా విలసిల్లుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా | **స్వాగతిస్తున్న లక్నవరం ప్రకృతి అందాలు..**

- సజీవ సాక్ష్యంగా కాకతీయ కట్టడాలు
- పిల్లలకు ఆహ్లాదంతోపాటు చారిత్రక విశేషాలు తెలుసుకునే అవకాశం

తరగతి గదుల్లో పుస్తకాలతో నిత్యం కుస్తీ పట్టే విద్యార్థులకు సెలవులు వచ్చాయంటే ఎగిరి గంతేస్తారు. అయితే నిర్దిష్ట లక్ష్యాలతో చదువుతున్న విద్యార్థులకు కాస్తా మానసిక ఉల్లాసం లభించాలంటే కొత్త పర్యాటక ప్రాంతాలు సందర్శించాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థలకు ఆది, సోమ, మంగళవారం వరుసగా మూడు రోజులు క్రిస్మస్ సెలవులు ప్రకటించింది. దీంతో విద్యార్థులు అమ్మమ్మగారింటికి, పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాతిక ప్రదేశాలకు బయలుదేరుతున్నారు. ఈ పర్యటనతో వారిలో ఆహ్లాదంతోపాటు పలు చారిత్రక విశేషాలు తెలుసుకునే అవకాశం ఉంది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధానంగా వరంగల్ కోట, పాకాల, రామప్ప, లక్నవరం, మేడారం, మంగపేటలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, పాండవుల గుట్టలు, కోటగుళ్లు, ఐనవోలు మల్లికార్జునస్వామివారి ఆలయం, కొమురెల్లి, కురవి వీరభద్రస్వామి ఆలయం, చిల్పూరు గుట్ట, పాలకుర్తి సోమేశ్వరాలయం, జైనమందిరం, తదితర పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. ఇతర జిల్లాలోని వేములవాడ, యాదగిరి గుట్ట, హైదరాబాద్‌లోని బిర్లా టెంపుల్, వండర్ లా, సమతామూర్తి ఆశ్రమం, రామోజీ ఫిలిం సిటీ, తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టత, తదితర వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం. –ఖిలా వరంగల్



ఏకశిల గుట్ట

పర్యాటక కేంద్రంగా ఓరుగల్లు

కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోట ప్రపంచ పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. పిచుకల కీచుకీచులు.. కోకిల రాగాల మధ్య కోట.. పర్యాటకులను స్వాగతిస్తోంది. కాకతీయులు శకం ముగిసి 800 ఏళ్లు పూర్తయినా నేటికీ కోట చారిత్రక కట్టడాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. నాలుగు కీర్తి తోరణాల మధ్య స్వయంభూశంభు లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలుస్తోంది. నల్ల రాతిలో నాటి శిల్పులు చెక్కిన అద్భుత కళా ఖండాలు, కళా సంపద దర్శనమిస్తుంది. నాటి ఆనవాళ్లు నేటికీ సజీవంగా నిలిచి ఉన్నాయి. తొలుత సందర్శకులకు రాతి, మట్టికోటలు దర్శన మిస్తాయి. కోటలో ప్రవేశించగానే శిల్పాలకు ఇరువైపులా పచ్చని పంటపొలాలు, వివిధ ఆకుకూరల తోటలు, మొక్క జొన్న, బంతి తోటలు పర్యాటకులను స్వాగతిస్తాయి. ఖుష్‌మహల్, ఏకశిలా గుట్టపై నుంచి చూస్తే త్రినగరం పూర్తిగా కళ్లముందు కదలాడుతుంది. దీనికి తోడు ఏకశిలా చిల్డ్రన్ పార్క్, గుండు చెరువులో బోటింగ్ సౌకర్యాలు, ఏకశిలా గుట్ట పలువురి మనసులు దోచుకుంటోంది.



మధ్యకోటలో శిల్పాల ప్రాంగణం

రమణీయం.. రామప్ప ఆలయం.



కాకతీయుల పాలనలో రామప్ప గుడి నిర్మాణం జరిగింది. నాటి శిల్పులు నల్ల రాతిలో చెక్కిన అద్భుత కళారూపాలు, శిల్ప సౌందర్యం చూపరులను ఆకట్టుకుంటుంది. శిల్ప కళా రూపాల్లోనించి సప్తస్వరాలు పలికించే కళాఖండాలను చేతులతో తడుముతూ సంపదను వీక్షిస్తుంటారు. శిల్పాల్లో భారీ నందీశ్వరుడి విగ్రహం ప్రతిష్ఠించారు. శివుడి ఆజ్ఞ కోసం ఎదురుచూస్తున్నట్లు నందీశ్వరుడు దర్శనమిస్తాడు. ఈ విగ్రహం ఎటు నుంచి చూసిన మనవైపే చూస్తున్నట్లు కనిపిస్తుండడం విశేషం. నందీశ్వరుడి తల, చేతి గోరు తడిమితే తోక వద్ద స్పష్ట స్వరాలు వినిపిస్తాయి.

హైదరాబాద్ టూర్ ప్లాన్ చేశాం.



బంధువులతో కలిసి ముందుగానే హైదరాబాద్ టూర్ ఫిక్స్ చేశాం. పిల్లలకు ఆది, సోమ, మంగళవారం మూడురోజులు సెలువురావడంతో కారులోనే హైదరాబాద్ వెళ్తున్నాం. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో నిర్మించిన సమతామూర్తి ఆశ్రమాన్ని దర్శించుకుంటాం. అక్కడి నుంచి రామోజీ ఫిలిం సిటీ వెళ్తాం. తిరుగు ప్రయాణంలో యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి వారిని దర్శించుకుంటాం.

మునుగోటి శ్రీలత, వరంగల్

భద్రాచలం వెళ్తున్నాం



మానసిక ప్రశాంతత కోసం కుటుంబ సమేతంగా భద్రాచలం వెళ్తున్నాం. ధనుర్మాసంలో సీతారామచంద్రస్వామి దర్శించుకుంటే పుణ్యం. పాఠశాలకు మూడు రోజుల సెలువులు రావడంతో పిల్లలు, బంధువులతో కలిసి భద్రాచలం వెళ్తున్నాం. తరువాత బోటులో పాపికొండలకు వెళ్తాం. తిరుగు ప్రయాణంలో కిన్నెరసాని డ్యామ్, సరస్సు చూస్తాం.

ముద్దసాని సత్యనారాయణరెడ్డి, వరంగల్

రైతులకు న్యాయం చేయాలి

- తెలంగాణ రైతు సంఘం సలహాదారుడు వెంకటనారాయణ



మాట్లాడుతున్న వెంకట నారాయణ

హన్మకొండ: సన్న, చిన్నకారులు, కౌలు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం సలహాదారుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం హనుమకొండ బాలసముద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో 8000 మందికి పైగా కౌలు, సన్న, చిన్న కారు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు ద్వారా రూ.65 వేల కోట్లు పంపిణీ చేసినప్పటికీ... ఇందులో రూ.40 వేల కోట్లు సామ్ము భూస్వాములు, కార్పొరేట్ సంస్థల యజమానులు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ దిగ్గజాలు, జమీందారులకు మాత్రమే చేరిందని వివరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న, సన్న కారు, కౌలు రైతులకు న్యాయం జరిగేలా విధానాలు రూపొందించాలన్నారు. వ్యవసాయ మార్కెట్లలో అవినీతి జరగకుండా నియంత్రించాలన్నారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని, రైతు రుణాలు మాఫీ చేసి చిన్న, సన్నకారు రైతులను రుణ విముక్తులను చేయాలని కోరారు. వివిధ పంటలకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నదాతల ఆత్మహత్యలు ఉండొద్దని, రైతు సంక్షేమం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సమావేశంలో రైతు నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్, వొడెల రాజన్న, సిరుల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌ను కలిసిన యశ్వంత్



గవర్నర్‌కు ఆల్బమ్ అందజేస్తున్న యశ్వంత్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన మౌంటెయినర్ భూక్యా యశ్వంత్ శనివారం ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల ఆస్ట్రేలియాలోని ఎత్తైన కోజిస్కోన్ పర్వతాన్ని అధిరోహించి శిఖరంపై భారతదేశ పతాకం ఎగరవేసినట్లు గవర్నర్‌కు వివరించారు. అలాగే, త్వరలో ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించనున్నట్లు గవర్నర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ బిశ్వభూషణ్.. యశ్వంత్ ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

కీచక.. కాలేజీ చైర్మన్



సీసీ ఫుటేజీలను సేకరిస్తున్న పోలీసులు



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు

- అర్ధరాత్రి విద్యార్థినితో అసభ్య ప్రవర్తన
- శ్రీచైతన్య కళాశాల యజమాని నిర్వాకం
- పోలీసులకు ఫిర్యాదు.. పోక్సో కేసు నమోదు
- కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన

హసన్‌పర్తి: బాధ్యతాయుత స్థానంలో ఉన్నోడు.. విద్యార్థుల భవితకు బాసటగా నిలవాల్సినోడు. కూతురి వయసున్న ఓ విద్యార్థిపై కన్నేశాడు. వంకర బుద్ధితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు కళాశాల యజమానిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటితో పాటు పోక్సో కింద కేసు నమోదు చేశారు. భీమారానికి చెందిన బూర సురేందర్‌గౌడ్ స్థానికంగా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలను నడుపుతున్నాడు. ఈ కళాశాలలో బాయ్స్, గర్ల్స్ క్యాంపస్‌లు వేర్వేరుగా ఉన్నాయి. గర్ల్స్ క్యాంపస్ నిర్వహిస్తున్న పై అంతస్తులోనే సురేందర్.. కుటుంబసభ్యులతో ఉంటూ పర్యవేక్షణ సాగిస్తున్నాడు.

అర్ధరాత్రి విద్యార్థినికి ఫోన్

శుక్రవారం అర్ధరాత్రి సురేందర్‌గౌడ్ గర్ల్స్ క్యాంపస్‌లో ఉంటున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినికి ఫోన్ చేశాడు. రెండో అంతస్తులో ఉన్న ఆ విద్యార్థిని కిందికి రమ్మని చెప్పాడు. ఫోన్ చేసినప్పటికీ ఆ విద్యార్థిని స్పందించలేదు. పది సార్లు ఫోన్ చేయడంతో ఆమె మరో పది మంది విద్యార్థులను వెంటబెట్టుకుని కిందికి దిగింది. అప్పటికే రాత్రి 12 గంటలు దాటింది. ఈక్రమంలో సురేందర్‌గౌడ్ తనపై అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆ విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విద్యార్థినితోపాటు మరికొంతమంది విద్యార్థులు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు శనివారం కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు

ఈ విషయమై విద్యార్థినుల తల్లిదండ్రులు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కళాశాల యజమాని తమ పిల్లలపై అసభ్యరకంగా వ్యవహరించాడని పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ కర్నాకర్, స్థానిక ఎస్సై సురేశ్ ఘటనా స్థలికి చేరుకుని సీసీటీవీ ఫుటేజీలను సేకరించారు.

కళాశాల ఎదుట ఆందోళన

విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నేతలు శనివారం కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం అర్ధరాత్రి వరకు ఆందోళన సాగింది. కార్యక్రమంలో బీఎస్పీ రీజియన్ కార్యదర్శి కన్నం సునీల్, టీబీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, విద్యార్థి సంఘాల నాయకులు ఉషాన్‌నాయక్, మామిడి నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న భుజంగరెడ్డి

హన్మకొండ కల్చరల్/కాశిబుగ్గ: యువత వివేకానందుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా సమాజంలో పేరు తెచ్చుకోవాలని వరంగల్ ఏవీవీ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ భుజంగరెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భుజంగరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాల్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందు వరసలో ఉండాలన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాష్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా యువత అవగాహన కల్పించాలన్నారు. వరంగల్ జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి సత్యవాణి మాట్లాడుతూ.. కళారంగానికి చెందిన వివిధ అంశాల్లో సాంస్కృతిక పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ పాఠశాలల, సంగీత, నాట్య అకాడమీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

గంటకు ఘన చరిత్ర..

- సెంటినరీబాప్టిస్ట్ చర్చిలో వందేళ్లకు పైబడిన బెల్

హన్మకొండ కల్చరల్ : హనుమకొండలోని సెంటినరీబాప్టిస్ట్ చర్చిలో ఉన్న బెల్ (గంట)కు వంద సంవత్సరాలకు పైబడిన ఘనచరిత్ర ఉంది. స్వాతంత్ర్య ఉద్యమ చైతన్యంతో అమెరికాలో ఎంతో శాస్త్రసాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధి జరిగింది. పారిశ్రామిక చైతన్యం పెంపొందించిన వారిలో బెంజిమెన్ హంక్స్ ఒకరు. ఇతడు అమెరికా సైన్యంలో డ్రమ్మర్‌గా విధులు నిర్వర్తించేవాడు. అలాగే, లిచ్‌ఫీల్డ్‌లో మొదట తన కర్మాగారం ప్రారంభించి చర్చి బెల్స్ తయారు చేశాడు. తరువాత తన కుమారుడు జ్యూలియస్‌హంక్స్‌తో కలిసి మ్యాన్స్‌ఫీల్డ్, వెస్ట్ రాయ్‌లలో పెద్ద కర్మాగారాలు స్థాపించాడు. ఇక్కడ అప్రెంటీస్‌గా చేరిన ఆండ్రిమేన్‌లీ.. బెంజిమెన్‌హంక్స్ మనవరాలిని పెళ్లి చేసుకుని ఆ తరువాత న్యూయార్క్‌లోని గిబ్బన్స్‌విల్లేలో తన సొంత కర్మాగారం ఏర్పాటు చేశాడు. తరువాత ఆండ్రిమేన్‌లీ మూడో కుమారుడు 1870లో పాయిల్ నది ఒడ్డున మేన్‌లీ బెల్ కంపెనీని స్థాపించాడు. ఈ బెల్ కంపెనీ 1952 వరకు పని చేసింది. 1883లో వీరు ఎక్కువ సంఖ్యలో బెల్స్‌ను తయారుచేశారు. ఆ విధంగా తయారైన బెల్‌ను 1983లో వరంగల్‌కు తీసుకొచ్చి హనుమకొండ సెంటినరీబాప్టిస్ట్ చర్చిలో ఏర్పాటు చేశారు. కాగా, ఇక్కడ ఏర్పాటు చేసిన చర్చి బెల్‌ను మేన్‌లీ అండ్ కంపెనీ తయారు చేసింది.



హనుమకొండ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో ఏర్పాటు చేసిన బెల్

40 అడుగుల క్రిస్మస్ ట్రీ, ఇటలీ పశువుల పాక

- శోభాయమానంగా కరుణాపురం చర్చి

ధర్మసాగర్/కాజీపేట రూరల్: ధర్మసాగర్ మండలం కరుణాపురంలో అపురూప కట్టడంగా పేరుగాంచిన క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం క్రిస్మస్ పండుగకు ముస్తాబైంది. చర్చి వ్యవస్థాపకులు, అంతర్జాతీయ దైవజనులు రెవరెండ్ డాక్టర్ సంగాల పాలస్‌రాజ్, గోపు జయప్రకాష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ ఏర్పాట్లు చేస్తున్నారు. రంగు రంగుల విద్యుత్ కాంతులతో చర్చిని అలంకరించారు. ఇప్పటికే చర్చిని తిలకించేందుకు దేశ నలుమూలల నుంచి అనేకమంది సందర్శకులు వస్తున్నారు. ఇజ్రాయల్ దేశంనుంచి తెచ్చిన 1600, 600, 100 ఏళ్ల నాటి ఒలీవ చెట్లు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. ఈ సందర్భంగా పాల్సన్‌రాజ్, జయప్రకాష్ మాట్లాడుతూ చర్చి నిర్మాణం తర్వాత మొదటిసారి జరిగే క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని 24వ తేదీ రాత్రి క్యాండిలైట్ సర్వీస్, 25న క్రిస్మస్ పండుగ రోజు ఊరేగింపు, ప్రత్యేక క్రిస్మస్ గీతాలు ఉంటాయని తెలిపారు. ప్రాంగణంలో 40 ఫీట్లతో క్రిస్మస్ ట్రీ, ఇటలీనుంచి తెచ్చిన సెట్టుతో పశువుల పాకను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పండుగ రోజు 20 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పశువుల పాక

ప్రజా సమస్యలే కమ్యూనిస్టుల ఎజెండా

కాజీపేట: ప్రజా సమస్యల పరిష్కారాన్ని ఎజెండాగా ఎంచుకొని అవిశ్రాంత పోరాటం చేస్తున్న ఘనత భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కే దక్కుతుందని హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. కాజీపేట పట్టణంలోని ఆరుట్ల రాంచంద్రారెడ్డి (ఏఆర్ఆర్ నగర్) కాలనీలో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఎర్రజెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే నేటికీ దేశం పేదరికంలో మగ్గుతూ, యువత నిరుద్యోగ సమస్యతో కాలం వెళ్లదీస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాసమల్ల దీనా, శంకర్ నాయక్, ఎర్ర జయ, అనసూర్య, బండ్ల రాజమణి పాల్గొన్నారు.



వేడుకల్లో మాట్లాడుతున్న ఎల్లేష్

బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి

మడికొండ: అదానీ, అంబానీలకు ఆస్తులను కట్టబెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ సూచించారు. పార్టీ 99వ వార్షికోత్సవం సందర్భంగా మడికొండలోని రావి నారాయణరెడ్డి కాలనీలో శనివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు.